క్లుప్తంగా

మొరాయించిన పెట్రోకార్



దామెర : మండల కేంద్రంలో పోలీస్ వాహనం మొరాయించడంతో అక్కడే ఉన్న యువకులు తలా ఓ చేయి వేసి నెట్టడంతో స్టార్ట్ అయ్యింది. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పర్యటన సందర్భంగా గ్రామంలో గురువారం గస్తీ తిరుగుతున్న పెట్రోకార్ ఒక్కసారిగా ఆగిపోయింది. డ్రైవర్ ఎంతగా ప్రయత్నించినా స్టార్ట్ కాకపోవడంలో విధుల్లో ఉన్న పోలీస్‌తోపాటు అక్కడే ఉన్న ఇద్దరు యువకులు నెట్టడంతతో వాహనం స్టార్ట్ అయ్యింది. శాంతిభద్రతల పరిరక్షణలో 24 గంటలు సేవలందించాల్సిన పెట్రో కార్ అత్యవసర పరిస్థితిలో మొరయిస్తే ఎలా అని ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

భీమదేవరపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ధనిక, కార్పొరేట్ వర్గాలకు పెద్దపీట వేయడాన్ని నిరసిస్తూ మండలంలోని ములకనూర్ గ్రామంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు, మంచాల రమాదేవి, తిరుపతి, ఆదరి రమేష్, కృష్ణారెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, ఉమ, స్వప్న, మమత, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

'గెస్ట్ ఫ్యాకల్టీ' కోసం దరఖాస్తుల ఆహ్వానం

దామెర : మండలంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో, జనగామలోని కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల్లో పని చేయడం కోసం అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ డీఎస్.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, తెలుగు సబ్జెక్టులకు రెండు, బాటనీ, కంప్యూటర్ ప్రోగ్రామర్, కెమిస్ట్రీ కోసం ఒకటి చొప్పున ఖాళీలున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతానికి మించి మార్కులు ఉండాలని తెలిపారు. నెట్, సెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. దరఖాస్తుదారులు ఈనెల 6న ఓగ్లాపూర్ ఎస్‌బీఐటీ ప్రాంగణంలో నిర్వహించనున్న డెమో, ఇంటర్వ్యూకు జిరాక్స్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 8978905817లో సంప్రదించాలని సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు : నేడు (శుక్రవారం) మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, వివిధ శాఖ అధికారులు సకాలంలో హాజరుకావాలని అయన కోరారు.

పరామర్శ

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన చింతపట్ల సౌందర్య అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ గురువారం పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం సౌందరయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉప్పుల సుదర్శన్, జైపాల్ రెడ్డి, వాసు, అలువాల రవి, దేవరాజు, బయ్య తిరుపతి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

భీమదేవరపల్లి : మండలంలోని ముల్కనూర్‌లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముల్కనూర్ బుడ్గజంగాల కాలనీకి చెందిన పురానం జంపయ్య (37) గురువారం మృతి చెందాడని అతడి కుటుంబీకులు తెలిపారు. జంపయ్య సమ్మయ్య అనే వ్యక్తితో కలిసి స్కూటీపై బస్టాండ్‌కు వస్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సమ్మయ్యకు సైతం గాయాలు కాగా అతడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

డ్రోన్ ద్వారానే నానో యూరియా పిచికారీ

భీమదేవరపల్లి : డ్రోన్ ద్వారానే నానో యూరియాను పిచికారీ చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. మండల కేంద్రంలో ముల్కనూర్ సహకార సంఘం, వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నానో యూరియాపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మాట్లాడారు. నానో యూరియా వల్ల కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో ఎంసీఆర్సీ జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి, ఏఓ అఫ్జల్‌పాషా, ఇఫ్‌కో కంపెనీ జిల్లా మేనేజర్ విశాల్ పాండె తదితరులు పాల్గొన్నారు.

'దేవాదుల' నీటి విడుదల ఎప్పుడు?

- కొరతతో తీవ్ర ఇబ్బందులు
- పోరుబాటలో రైతులు



పిచ్చిమొక్కలతో నిండిన దేవాదుల ఉత్తర కాలువ

భీమదేవరపల్లి : దేవాదుల నీటి విడుదలపై రైతుల్లో కలవరం మొదలైంది. యాసంగి పంటలకు నీటి కటకట మొదలవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. నీటి విడుదల కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల రైతులు పోరుబాట పట్టేందుకు సిద్ధమౌవుతున్నారు.

ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి దేవాదుల ఉత్తర కాలువ ద్వారా ధర్మసాగర్ మండలంలోని దేవునూర్, సోమదేవరపల్లి ఎల్కతుర్తి మండలంలోని దామెర, చింతలపల్లి, గోపాల్‌పూర్, జీల్గుల, జగన్నాథపూర్, భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి, ముల్కనూర్, భీమదేవరపల్లి, కొప్పూర్, మాణిక్యాపూర్, కాట్రపల్లి, ఇప్పల్ నర్సింగపూర్ గ్రామాల్లోని 15 వేల ఎకరాలకు సాగు నీరు అందనుంది. కాగా ఉత్తర కాలువపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యంతో నీరు ఎప్పుడు విడదల అవుతుందో..? ఎప్పుడు నీరు నిలిపివేస్తారో..? తెలియని పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో రైతులే నీటిని విడుదల చేసుకొని కాలువలు మరమ్మతు చేసుకున్నారు.

మరమ్మతులు లేని కాలువ

దేవాదుల ఉత్తర కాలువలో పిచ్చిమొక్కలు పెరగడంతోపాటుగా వర్షాలకు పలు చోట్ల కాలువలు వాటికి మరమ్మత్తు లేకపోవడం, కాలువల్లో ఏపుగా పెరిగిన చెట్లు ఉండడంతో విడుదలైన నీరు విడుదల చివరి వరకు చేరడం సైతం ఇబ్బందిగా పరిణించింది. అధికారులు కాలువల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటుగా తెగిన కాలువలకు మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇక ఈ ప్రాంతలో రైతులు బోర్లు, బావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా యాసంగిలో వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు వేశారు. ఇటీవలే నీటి మట్టం పడిపోవడంతో పంటలకు సాగు నీరు అందడం రైతులకు ఇబ్బందిగా మారింది. దీంతో రైతులు దేవాదుల ఉత్తర కాలువ నుంచి సాగు నీటి కోసం ఎదురు చూస్తూ నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. అయితే దేవాదుల నీటి విడుదల కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతులతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎలకతుర్తి, భీమదేవరపల్లి మండలాల రైతులను చైతన్యవంతం చేస్తూ పోరుబాట పట్టేందుకు సిద్ధమౌతున్నారు. ఈ క్రమంలోనే దేవాదుల సీఈకి శుక్రవారం వినతిపత్రం అందించి తరువాత కార్యక్రమాన్ని చేపటనున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ తెలిపారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేయాలి



నడికూడ : నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు



ధర్మసాగర్ : సీపీఎం ఆధ్వర్యంలో..

నడికూడ : ఏసీడీ విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుతం ఏసీడీ చార్జీల పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారీ భారం మోపుతోందని విమర్శించారు. వ్యవసాయానికి 24 గంటలూ ఉచితంగా విద్యుత్ ఇస్తామని ఊదరగొట్టినా కనీసం 12 గంటలు కూడా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. విద్యుత్ కోతల వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఏసీడీ విద్యుత్ చార్జీలు రద్దు చేయడంతోపాటు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

ధర్మసాగర్ : సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల బాధ్యుడు వేల్పుల రవి మాట్లాడారు. ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బానాల సుధాకర్, కొయ్యడ శంకర్, గడ్డమీది శ్రీనివాస్, వెంకన్న, మహేష్, రజిత, రేనా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కీలకం



నర్సరీని పరిశీలిస్తున్న సీఈఓ వెంకటేశ్వర్‌రావు

కమలాపూర్ : పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కీలకమని జెడ్పీ సీఈఓ ఎస్.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని శంభునిపల్లిలో గురువారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. తడి, పొడిగా చెత్తను ఇళ్ల వద్దే వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. మంచినీటిని అవసరమైన మేరకే వాడుకోవాలని, వృధా చేయవద్దని తెలిపారు. అనంతరం శ్మశానవాటిక, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి పల్లెప్రగతి యాప్ పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ పల్లవి, సర్పంచ్ పెండ్యాల రవీందర్ రెడ్డి, ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న గుజ్జుల సత్యనారాయణరావు

శాయంపేట : రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మండల ఇన్‌చార్జ్ గుజ్జుల సత్యనారాయణరావు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి తదనంతరం విస్మరించిందని చెప్పారు. ప్రజలు బీఆర్ఎస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో బూత్ కమిటీల నియామకాలను పూర్తి చేయాలని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ, బూత్ కమిటీ అధ్యక్షులు మేకల సుమన్, బాసాని నవీన్, సీనియర్ నాయకులు గంగుల రమణారెడ్డి, విద్యాసాగర్, దేవరాజ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్‌రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఖాజా పాషా, నాయకులు రాఘవేంద్ర శర్మ, స్రవంతి, కరుణాకర్, శివ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



శాయంపేట : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా, లింక్ వర్కర్స్ టీం వరంగల్ డీఆర్‌పీ జ్యోతి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీడీఓ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పరకాల బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ అరుణ్‌కుమార్, ఎంపీఓ రంజిత్‌కమార్, ఏపీఓ అనిత, పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ, రవీన, మురళీకృష్ణ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రజిత, ప్రమీల, సుమలత, ప్రశాంత, రమేష్, రోజా తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యల పరిష్కారమే లక్ష్యం



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న డాక్టర్ గీతాలక్ష్మి

కమలాపూర్ : ప్రజల కంటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాలక్ష్మి తెలిపారు. కమలాపూర్, భీంపల్లి, గూనిపర్తి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను గురువారం ఆమె సందర్శించి మాట్లాడారు. శుక్లపటలానికి సంబంధించిన అంధత్వ నివారణ, సాధ్యమైన అంధత్వ నివారణ కోసం కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లకుపైబడ్డ ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హర్షిణీ ప్రియ, డాక్టర్ రేణుక, డాక్టర్ మౌనిక, ఎంపీహెచ్‌ఓ రమేష్, పీహెచ్‌ఎన్ దయామణి, హెల్త్ సూపర్‌వైజర్లు శోభ, విప్లవ్‌కుమార్, మేరీ విజయ, కనకలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

కమలాపూర్ : మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ ధర్మశాస్తా సేవా సమితి ఆధ్వర్యంలో నేటి నుంచి మూడ్రోజుల పాటు అయ్యప్ప స్వామి మూర్తి, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు జరుగుతాయని గురుస్వామి ఇందుర్తి జానకి రామారావు, చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు.

గ్రామాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

ఐనవోలు : గ్రామాల అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సమ్మెట మహేష్ విమర్శించారు. మండలంలోని కక్కిరాలపల్లి గ్రామాన్ని స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. పాత గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని కూల్చి కొత్త భవనాన్ని నిర్మిస్తామని అధికార పార్టీ నాయకులు, పంచాయతీ పాలకవర్గం నమ్మబలికి తదనంతరం విస్మరించినట్లు తెలిపారు. నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాది గడచినా ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కూస చిరంజీవిరెడ్డి, కొత్తూరు సునీల్, బొమ్మినేని రాకేష్‌రెడ్డి, పైండ్ల సంపత్, కంజర్ల తిరుపతి, కంజర్ల రవీందర్, అరూరి అశోక్, కాటబోయిన రవి, రంజిత్, చాంద్‌పాషా, మహమూద్, పి.వెంకన్న, రామగిరి సంపత్, కుమారస్వామి, రమేష్, పల్లపు రాజు, గుండపు వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే సీఎం ధ్యేయం

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



దామెర : పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర : మహిళల అభ్యున్నతే సీఎం కేసీఆర్ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మహిళా సమాఖ్య, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. మహిళలకు, ప్రభుత్వానికి నడుమ గ్రామైఖ్య సంఘాలు వారధిగా పని చేస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా 42 మహిళా సమాఖ్య భవనాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. నగరంలో నిర్వహిస్తున్న దామెర శాఖ బ్యాంకును మండలంలో ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. తొలుత మహిళలు బతుకమ్మలు, బోనాలు, కోలాటాలతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్ రావు, పంచాయతీరాజ్ శాఖ డీఈ లింగారెడ్డి, ఏపీఎం ఝాన్సీ, విద్యుత్ ఏఈ గుర్రం రమేష్, జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి, రైతుబంధు కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, దళితబంధు కోఆర్డినేటర్ గరిగె కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, సర్పంచ్‌లు గురిజాల శ్రీరాంరెడ్డి, శ్రీనివాస్, సాంబయ్య, నాయకులు దామెరుప్పుల శంకర్, మెంతులు రాజు, దాడి మల్లయ్య, జన్ను మల్లయ్య, సంపత్, కృష్ణమూర్తి, బత్తిని రాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

మండల కేంద్రంలో ఎంసీపీఐయూ కార్యాలయ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ మండల కార్యదర్శి బండారి చిరంజీవి ఆధ్వర్యంలోని బృందం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం చిరంజీవి మాట్లాడారు. మండల కేంద్రంలో గతంలో పార్టీ కార్యాలయం ఉన్న స్థలాన్ని మహిళా సమాఖ్య భవనానికి కేటాయించారని తెలిపారు. పార్టీ భవన నిర్మాణం కోసం ప్రత్యామ్నాయంగా స్థలం ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు గోనెల గోపాల్, జె.శంకర్, రామచంద్రు, రాజు, అశోక్, రమేష్, పోషాలు తదితరులున్నారు.

విద్యార్థినికి అభినందన



దామెర : విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని డిస్నీ ల్యాండ్ పాఠశాల విద్యార్థి యు.వర్షిత రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చి బహుమతి సాధించగా ఆమెను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ, ఇతర అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. వినూత్నమైన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేష్‌భాను, దినేష్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలని వినతి

పరకాల : తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈనెల 3 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి చర్చించాలని కోరుతూ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి మండల వీఆర్‌ఏలు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడారు. పీఆర్సీ అమలు, పదోన్నతుల కోసం 14 నెలల పాటు దీక్షలు చేపట్టగా సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం అమలు విషయాన్ని నిర్లక్ష్యం చేస్తోందని వాపోయారు. తమను మరోసారి రోడ్డు మీదకు లాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

ఖాళీలను 'ఆశ'లతో భర్తీ చేయండి

శాయంపేట : వైద్య, ఆరోగ్య శాఖలోని ఉద్యోగ ఖాళీలను ఆశా కార్యకర్తలతో భర్తీ చేయాలని ఆశా కార్యకర్తల సంక్షేమ సంఘం మండల బాధ్యులు మామిడి రమ, కోగిల సృజన డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో భూపాలపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ మనవిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సత్వరమే నియామకాలు చేపట్టేలా చొరవ చూపాలని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆశా కార్యకర్తలు పెంబర్తి నీల, బొమ్మకంటి సుజాత, సరిత తదితరులున్నారు.

విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ



విద్యార్థికి పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రవళిక

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి జెడ్పీ హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు కేరింగ్ హ్యాండ్స్ టుగెదర్ సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు ప్రవళిక గురువారం సుమారు రూ.20 వేల విలువైన ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో వీఎంఎఫ్ రవీందర్, హెచ్ఎం ఆరోగ్యమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ పొన్నాల రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

బాధితులకు భరోసా కలిగించాలి : డీసీపీ



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ బారి

భీమదేవరపల్లి : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందన్న భరోసా కలిగించేలా పోలీసులు వ్యవహరించాలని సెంట్రల్ జోన్ డీసీపీ మహ్మద్ అబ్దుల్ బారి కోరారు. మండలంలోని ముల్కనూరు, వంగర పోలీస్‌స్టేషన్లను గురువారం అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, పోలీస్ క్వార్టర్‌లను సందర్శించి పరిశీలించారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు ముల్కనూర్ పోలీస్‌స్టేషన్‌కు రావడాన్ని గమనించి చలించిపోయారు. సదరు వృద్ధురాలు వద్దకు వెళ్లి సమస్య తెలుసుకుని పరిష్కరించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, మౌనిక సిబ్బంది ఉన్నారు.


పట్టాలు సాధించే వరకు పోరాడాలి

దామెర : ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలు పట్టాలు సాధించే వరకు పోరాడాలని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఓగ్లాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో పేదలు వేసిన గుడిసెల్లో గురువారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. కేసులకు భయపడొద్దన్నారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు గుడిసెల్లోనే ఉండాలని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామన్న హామీని సీఎం కేసీఆర్ విస్మరించాడని విమర్శించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యుడు మారపాక అనిల్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, జిల్లా సమితి సభ్యులు కండె నర్సయ్య, కొట్టెపాక రవి, అంబి సాంబయ్య, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, ప్రజానాట్య మండలి జిల్లా సమితి సభ్యులు రొంటాల శ్యామ్, అరుణ, సునీత, అఖిల, భాస్కర్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఎల్కతుర్తి : రబీ సీజన్‌లో విద్యుత్ కోతలను నియంత్రించేందుకు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి ఏర్పాటు చేయగా డీఈ సామ్యానాయక్ గురువారం వివరాలు వెల్లడించారు. రబీలో ఎల్కతుర్తి పరిధిలో వ్యవసాయానికి, ఇతర విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండడంతో విద్యుత్ కోతలను నియంత్రించేందుకు 5-ఎంవీఏ పీటీఆర్ తొలగించి 8-ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ పైడయ్య, ఎంఆర్టీ డీఈ శ్రీధర్, ఏడీఈ జానకిరామ్, ఏఈలు గంగరాజు, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

ఎల్కతుర్తి : కేరళలో జరిగిన దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌లో మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బయ్యా సునీత తెలిపారు. ఉపాధ్యాయురాలు అచరిత దిశానిర్దేశంలో విద్యార్థులు హారీష్, జే.గణేష్ 'హ్యావ్ మ్యాథ్స్ ఇన్ యువర్ పాత్'లో ప్రదర్శించిన ఎగ్జిబిట్‌లో ప్రత్యేక బహుమతి అందుకోగా ఉపాధ్యాయురాలు అచరిత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ తరఫున ప్రత్యేక బహుమతి అందుకున్నారు. వారిని ప్రిన్సిపాల్ సునీత పాఠశాలలో శాలువా కప్పి సన్మానించారు.

జిల్లాస్థాయి పోటీలకు జట్టు ఎంపిక



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ప్రిన్సిపాల్

పరకాల : ఈనెల 8 నుంచి జరుగనున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు పరకాల జోన్ నుంచి 12 మందితో జట్టును అసోసియేషన్ జోన్ ప్రధాన కార్యదర్శి పసుల రమేష్ గురువారం ఎంపిక చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 40 మంది క్రీడాకారులు పాల్గొనగా 12 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జట్టును ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ పరిచేయం చేసుకొని అభినందించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.